ప్రజాశక్తి

శుక్రవారం 3 మే 2024 8 పేజీలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

నెల్లూరులో ఎప్పుడూ నువ్వా.. నేనా..!

- కాంగ్రెస్, టిడిపి, ఇండిపెండెంటలదే హవా
- నగర ఓటర్లు వినూత్న తీర్పులు
- 1952-2024 రివ్యూ

సింహపురి రాజకీయాల్లో నెల్లూరు నగర ఓటర్ల తీర్పు ఎప్పుడు వినూత్నంగానే ఉంటుంది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినా అందుకు అనుగుణంగా ఎప్పుడు ఓట్లు వేయరు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కేవలం 50 నుంచి 60 శాతం పోలింగ్ జరగలేదు. సాధారణ, పేద ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. మరి కొందరు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. 1952 నుంచి ఇప్పటి వరకు ఏడు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు టిడిపి, మూడు సార్లు ఇండిపెండెంట్‌లు , ఒక్కసారి బిజెఎస్, ఒక సారి పిఆర్‌పి విజయం సాధించాయి. ప్రస్తుతం నెల్లూరు ఓటర్ తీర్పు ఎలా ఉంటుందనే విషయమై ఆసక్తి నెలకొంది.



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరునగర ఓటర్లు ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలీదు. అనేక విషయాలు నగర ఓటర్లను ఆకర్షిస్తాయి. 1952లో ఇక్కడ నియోజకవర్గం కింద ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఇద్దరు ఇండిపెండెంట్లు విజయం సాధించారు. స్వర్ణా వేమయ్య (ఇండి) కాంగ్రెస్ అభ్యర్థి కె.చిన్నయ్యపై విజయంసాధించారు. అదే ఎన్నికల్లో కె.కృష్ణారావు (ఇండి) కాంగ్రెస్ అభ్యర్థి ఎసిఎస్‌రెడ్డి పై విజయం సాధించారు. అప్పట్లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు ఎన్నికలు జరిగేవి. 1983 వరకు ఇది కొనసాగింది. 1955 ఎన్నికల సమయంలో ఆనం చెంచుసుబ్బారెడ్డి (కాంగ్రెస్) సిపిఐ అభ్యర్థి పి.విసిరెడ్డిపై విజయం సాధించారు. 1962 సమయంలో జిసి కొండయ్య (కాంగ్రెస్) సిపిఐ అభ్యర్థి పి.రామకోటయ్య విజయం సాధించారు.1967లో అన్నదాత మాధవరావు (బిజెఎస్) సిపిఎం అభ్యర్థి ఎన్.వెంకటకృష్ణయ్యపై విజయం సాధించారు. 1072లో ఆనం వెంకటరెడ్డి (కాంగ్రెస్) సిపిఎం అభ్యర్థి ఎం.అర్లప్ప పై విజయం సాధించారు. 1978 నాటికి కెవి సుబ్బారెడ్డి (కాంగ్రెస్) జనతా పార్టీ తరపున పోటీచేసిన ఆనం వెంకటరెడ్డిపై గెలిచారు. 1983లో ఎన్‌టిరామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించారు. ఆనం రామనారాయణ రెడ్డి (టిడిపి) కాంగ్రెస్ అభ్యర్థి కెవిఎస్‌రెడ్డిపై విజయం సాధించారు. 1985లో కె. వెంకటసుబ్బారెడ్డి (కాంగ్రెస్) టి. రమేష్‌రెడ్డిపై గెలిచారు. 1989లో జక్కా కోదండ రామిరెడ్డి (ఇండి) టిడిపి అభ్యర్థి టి.రమేష్‌రెడ్డిపై విజయం సాధించారు. 1994లో టి.రమేష్‌రెడ్డి (టిడిపి) కాంగ్రెస్ అభ్యర్థి పి.వి ప్రసన్నరెడ్డిపై గెలిచారు. 1999లో ఆనం వివేకానందరెడ్డి (కాంగ్రెస్) బిజెపి అభ్యర్థి డేగా నరసింహరెడ్డిపై విజయం సాధించారు. 2004లో ఆనం వివేకానందరెడ్డి (కాంగ్రెస్) బిజెపి అభ్యర్థి ఎన్.సురేష్‌రెడ్డిపై విజయం సాధించారు. 2009లో సినీ నటులు చిరంజీవి పిఆర్‌పి పార్టీ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాపితంగా అన్ని నియోజకవర్గాల్లో పోటీచేసినా

▸ 2లో

రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న బిజెపి

ప్రచారం చేస్తున్న సిపిఎం నగర అభ్యర్థి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ ఎన్నికల్లో బిజెపి 370 స్థానాలను గెలుచుకోవడం ఖాయం.. అధికారంలోకి రావడం తథ్యమని.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం రాజ్యాంగాన్ని సైతం మార్పు చేస్తామంటూ ప్రకటించడం దుర్మార్గమని సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలోని 4,6,7 డివిజన్ పరిధిలోని శెట్టిగుంట రోడ్డు, లక్ష్మీనగర్, మైపాడు రోడ్డు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు నుంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన సతీష్‌కుమార్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మన్నూరు భాస్కరయ్య, మిరియం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు బిజెపి కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, అందులో భాగంగా మత విద్వేషాలను సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. బిజెపి చర్యలను అడ్డుకుంటూ , ప్రతినిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న ఇండియా బ్లాక్ సిపిఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపు నిచ్చారు.

అనంతరం నగర నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి పరిష్కారం, విజయమహాల్ రైల్వే గేటు ప్రాంతంలో బాక్స్ టైపు బ్రిడ్జి, డంపింగ్ యార్డును దొంతాలి ప్రాంతం వద్దకు తరలించి ఆ ప్రాంతంలో చిల్డ్రన్స్ పార్కు, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవాలని కొందరు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకొని ఆ ప్రాంతంలో ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం పేరుతో పార్కు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు సిపిఎం చేసిన పోరాట ఫలితమే అన్నారు. కేంద్రంలో అధికారంలోని బిజెపి ప్రభుత్వం చెప్పిన మాటలను, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో తూచాతప్పకుండా పాటించి ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందన్నారు.

▸ 2లో

కందుకూరు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు



ప్రచారం చేస్తున్న బుర్రా

నాలుగు దశాబ్దాలుగా మానుగుంట కుటుంబానికి తోడునీడుగా ఉన్న మాచవరం బుర్రా మధుసూదన్ యాదవ్‌కు సంపూర్ణ స్వాగతం పలికింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం మాచవరం గ్రామంలో ఎన్నికల ప్రచార నిర్వహిం చిన వైసిపి కందుకూరు నియోజకవర్గం అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కు స్వాగతం పలికారు. మాచవరం గ్రామస్తులందరూ మాది ఒకే బాట మహీధర్ మాట అంటూ బుర్రా మధుసూదన్ యాదవ్ కు ఘన స్వాగతం పలికారు. గత నాలుగు దశాబ్దాలుగా మానుగుంట వెంటే మేము నడిచాం జగనన్న నిన్ను మెచ్చి మా వద్దకు పంపినందుకు మీతో కూడా

▸ 2లో

నవరత్నాల పేరుతో ఇంత మోసమా?

ప్రజాశక్తి-కందుకూరు

ఇంటూరికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గుడ్లూరు మండలం, చేవూరు, రావూరు, పంచాయితీల్లో నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం గురువారం చేశారు. ఆవులవారిపాలెం, మొండివారి పాలెంలో నాగేశ్వరరావు, ఇతర నేతలను సాదరంగా ఆహ్వానించి మత్స్యకార కుటుంబాలు మద్దతు తెలిపాయి. పోయినసారి ఫ్యాన్ గుర్తుకు

▸ 2లో

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి 6లో

నేడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రోడ్ షో 8లో

హత్యకేసులో నిందితులు అరెస్టు 3లో

ఓటరు హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు

4వ తేదీలోగా

ప్రజాశక్తి-నెల్లూరు

మాట్లాడుతున్న కలెక్టర్

ఓటు హక్కు వినియోగంపై ఓటర్ హెల్ప్ లైన్ కేంద్రాలను అన్ని నియోజకవర్గాల కేంద్రాలు, మున్సిపాలిటీ కేంద్రాల్లో ఈనెల 4వ తేదీలోగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల కమిషనింగ్, పోలింగ్ అధికారులకు శిక్షణ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు,

▸ 2లో

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

మాట్లాడుతున్న ఎస్‌పి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ హెచ్చరించారు. గురువారం ఈమేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గ్రామాల్లోని ప్రజలకు పోలీసు సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలను పోలీస్ అధికారులు , సిబ్బంది సందర్శించి ప్రజలను చైతన్యపరుస్తున్నారన్నారు. గ్రామాల్లోని ప్రజానీకంతో

▸ 2లో

మొదటిపేజీ తరువాయి

నెల్లూరులో ఎప్పుడూ ..నువ్వా..నేనా..

కేవలం నెల్లూరు నగరంలో మాత్రమే విజయం సాధించారు. ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి (పిఆర్‌పి) కాంగ్రెస్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌పై అతి స్వల్పంగా 99 ఓట్లతో గెలిచారు. ఇది ఆనం సోదరులకు, అనిల్‌కుమార్‌యాదవ్‌కు వివాదానికి కారణమైంది. అప్పటి నుంచి అనిల్‌కుమార్‌యాదవ్ వైసిపి వైపు చేశారు. 2014లో పి.అనిల్‌కుమార్‌యాదవ్ (వైసిపి) టిడిపి అభ్యర్థి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో పి. అనిల్‌కుమార్‌యాదవ్ (వైసిపి) టిడిపి అభ్యర్థి పి. నారాయణపై విజయం సాధించారు. నెల్లూరు నగర ఓటర్లు ఎప్పుడు విభిన్నమైన తీర్పు ఇచ్చారు. 1983 వరకు కాంగ్రెస్, ఇండిపెండెంట్లు, సిపిఎం మధ్య పోటీ సాగింది. అటు తరువాత టిడిపి, కాంగ్రెస్, మధ్య, ఇప్పుడు వైసిపి, టిడిపి మధ్య పోటీ సాగుతోంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకించే నగర ఓటర్లు అందుకు అనుగుణంగా ఓట్లు వేడయం లేదు.ప్రస్తుతం ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పి. నారాయణ, సిపిఎం అభ్యర్థిగా మూలం రమేష్, వైసిపి అభ్యర్థిగా ఖలీల్ అహ్మద్ పోటీ చేస్తున్నారు. నగర ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో చూడాలి.

పార్టీలో చేరిన దృశ్యం

తెలుగుదేశం పార్టీలో చేరికలు

ప్రజాశక్తి-లింగసముద్రం

లింగసముద్రం మండలం చినపవని పంచాయతీలోని సత్యనారాయణపురం గ్రామంలో గురువారం వైసీపీకి చెందిన పలువురు నియోజకవర్గ టిడిపి, జనసేన బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుసమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కేతినేని మాలకొండయ్య, సత్యనారాయణ, మాల్యాద్రి, గిరి, అయ్యప్ప, చొప్పరపు శేషయ్య, శ్రీనివాసులు, వేణు, నలగంగు మాల్యాద్రి, గొర్రెపాటి శంకర్ తదితరులు పార్టీలో చేరారు. గ్రామపార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, ముళ్లపాటి చౌదరి, పారా బుచ్చయ్య, బోయపాటి వెంకటేశ్వర్లు, గొర్రెపాటి శ్రీనివాసులు, కొడాలి కోటేశ్వరరావు, చాగంటి మల్లికార్జున, మాధవరపు బ్రహ్మయ్య, ముళ్లపాటి మహేష్, ఉమ్మనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కరోనాలోనూ కరుణించలేదు...

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదని కరోనా సమయంలోను కరోనాతో మరణించిన కుటుంబ సభ్యులకు అందాల్సిన బీమా ను అందించకుండా నిరుపేదలను మోసం చేసిందని నెల్లూరు సిటీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు శరణి పేర్కొన్నారు. 11వ డివిజన్లోని , సరస్వతి నగర్ తదితర ప్రాంతంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.తాను వెళ్లిన ప్రతి ఇంట్లో ప్రజలు , మహిళలు తమ కష్టాలు చెబుతున్నారని, ఒక మహిళ కరోనా సమయంలో తన భర్త చనిపోతే కనీసం బీమా అందకపోవడం దారుణమన్నారు.వైసీపీ ప్రభుత్వం జగనన్న భీమా పేరుతో ఒక్కరికి కూడా ఎలాంటి బీమా అందించలేదన్నారు.రానున్న తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం కింద సహజ మరణానికి 5 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే 10 లక్షలు అందిస్తుందన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ అసెంబ్లీ అభ్యర్థి నారాయణ కు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లకు సైకిల్ గుర్తుపై ఓటేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు.

రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న బిజెపి

మొదటిపేజీ తరువాయి

ఇంటిపన్నులు, కుళాయి పన్నులు పెంచడం, చెత్తపై పన్ను విధించడం, విద్యుత్ సంస్కరణల పేరుతో ఛార్జీలు పెంపుదల చేయడం, గ్యాస్ ధరలు పెంచడం, పెట్రోల్ ,డీజిల్ ధరలు పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటు తున్నాయ న్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి నేడు అధికారం కోసం బిజెపి చెంతన చేరిందని, ఇక ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల నుంచి తప్పించుకొనేందుకు వైసిపి ప్రభుత్వం బిజెపికి మద్దతు ఇస్తుందన్నారు. దేశ రాజకీయాలను పరిశీలిస్తే అర్థమౌ తుందని, మణిపూర్‌లో మహిళలను వివస్త్ర లుగా చేయడం, మైనార్టీలపై, క్రిస్టియన్లపై దాడులకు పాల్పడుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపికి ఈ రెండు పార్టీలు రాష్ట్రం నుంచి అండగా నిలుస్తున్నాయన్నారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే మైనార్టీలకు అమలు చేస్తున్న 4 శాతం రిజర్వేషన్‌ను తొలగిస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. బిజెపి దేశంలో 370 స్థానాలను గెలుచుకుంటుందని, రాజ్యాంగాన్ని మార్చివేస్తామని, హిందు దేశంగా ప్రకటిస్తామని ఎన్నికల ప్రచారాల్లో బాహాటంగా పేర్కొంటున్నారన్నారు. దేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లిములు, సిక్కులు ఒక్కటేమిటి అన్ని కులమతాలు కలిసి జాతీయోద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యం సాధించారన్నారు. కేంద్రంలో అధికారంలోని బిజెపి రోజుకో మాటచెబుతూ ప్రజలమధ్యలో విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రజలు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా బిజెపి చేసిందన్నారు. నగర నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ అయిన తన ఎన్నికల గుర్తు సుత్తికొడవలి నక్షత్రం, పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.రాజు ఎన్నికల గుర్తు హస్తంపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మూలె వెంగయ్య, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, టివివి ప్రసాద్, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ, నాయకులు నాగయ్య, చెంగయ్య, సుధాకర్, ఎం.విరమణ, హర్షా, చరణ్, మహిళా నాయకులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

39,40 డివిజన్ పరిధిలోని సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, కొండా ప్రసాద్, ఎన్.మాలకొండయ్య , విజయమ్మ, 10వ డివిజన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, 49,50 డివిజన్ పరిధిలో సిపిఎం నాయకులు ఆలూరు తిరుపాలు, లాయర్ అనిల్, జి.శ్రీనివాసులు, జి.సుధీర్, పాదర్తి మస్తానయ్య, మదన్, మస్తాన్, వెంకయ్య,నరసయ్య, రాజేంద్ర, పోతం శెట్టి శ్రీనివాసులు, పెద్దబ్బయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధికి కృషి

మొదటిపేజీ తరువాయి

అదే విధంగా నడుస్తామని తెలియజేశారు. మానుగుంట కుటుంబానికి సంపూర్ణ మద్దతు ఎలా ఇచ్చామో మీకు కూడా అలాగే ఇచ్చి జగనన్న మెచ్చి పంపించిన మిమ్ములను గెలిపించు కుంటామని గ్రామంలోని పెద్దలు యువకులు మహిళలు కుల మత వర్గాలకు భిన్నంగా తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బుర్రా మధుసూదన్ యాదవ్ మహీధర్ అన్న అనుమతితోనే జగనన్న పంపిస్తే ఈ నియోజకవర్గంలో అడుగుపెట్టానని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ ప్రజలకు సామాజిక న్యాయం కలిపించే ఉద్దేశంలో భాగంగా మహీధర్ అన్న నాకు మద్దతు ఇచ్చి నియోజకవర్గంలో నిలబెట్టారని కృషి వల్లే ఇంత త్వరగా ప్రజలకు చేరువు కాగలిగానని తెలిపారు.

జగనన్న సన్నిహితుడు, మహిధరన్న స్నేహితుడు విజయ్ సాయి రెడ్డి మన పార్లమెంట్ అభ్యర్థి కావడం నియోజకవర్గానికి అన్ని విధాలుగా మేలు చేకూరుస్తుందన్నారు. ప్రజల ఉద్దేశించి ప్రసంగిస్తూ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ సాయిరెడ్డికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాచవరంగ్రామ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూరం వేణుగోపాల రెడ్డి, సూరం శ్రీనివాసులు రెడ్డి, మారం రెడ్డి జయచంద్రారెడ్డి, కృష్ణపాటి శ్రీనివాస్ రెడ్డి, పాలేటి బాలయ్య, ఈర్ల వెంకటేశ్వర్లు, దండే కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

4వ తేదీలోగా ఓటరు హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాలు

పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతి ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.ఓటు హక్కు వినియోగం పై రాబోయే పది రోజులు స్వీప్ కార్యక్రమాలు ఎక్కువగా చేపట్టాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ను ఈనెల ఎనిమిదో తేదీలోగా ఏర్పాటు చేసుకొని ట్రైల్ రన్ చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లు అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ లొకేషన్లలో వీల్ చైర్ ఏర్పాటు చేస్తున్నామని, అవి వినియోగం అయ్యే విధంగా బిఎల్‌ఒలు చూడాలన్నారు.

నవరత్నాల పేరుతో ఇంత మోసమా

మొదటిపేజీ తరువాయి

ఓటేసి మోసపోయా మని, ఈసారి రెండుగ్రామాల ప్రజలు టిడిపికి ఓటు వేయాలని నిర్ణయించుకున్నామని నాగేశ్వరావుతో చెప్పారు. రాబోయే ప్రభుత్వంలో రెండు పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.చేవూరు, రావూరు గ్రామాల్లోకు పెద్దఎత్తున స్వాగతం పలికికారు. రామాయ పట్నంలో మేజర్ పోర్టు నిర్మాణానికి చంద్రబాబు ఆలోచిస్తే, మైనర్ పోర్టుకే జగన్ పరిమితం చేశారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తనకు, ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి తనను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పొట్టేళ్ల మురళి, కృష్ణ, గొల్లప్రోలు హరిప్రసాద్, పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మమేకమై, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగిం చుకోవాలని భరోసా కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కలిగించడమే పోలీసుల ముఖ్య ధ్యేయమని, ఎన్నికల్లో ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని, అందుకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రజలు గుర్తించా లన్నారు.సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, ఎటువంటి గొడవలు లేకుండా సజావుగా నిర్వహించేలా అందరు సహకరించాలని ఆయన పిలుపు నిచ్చారు. గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరిం చారు.

రోడ్ షోను విజయవంతం చేయండి...

ప్రజాశక్తి-నెల్లూరు సిటి

ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు , జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నెల్లూరు వస్తున్నారనీ, వారి రోడ్ షోను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు కే.వి.ఆర్. పెట్రోల్ బంక్ నుండి ఫత్తేఖాన్ పేట, ఆర్.టి.సి. బస్టాండ్, మద్రాస్ బస్టాండ్ మీదుగా వి.ఆర్.సి. సెంటర్ వరకు నెల్లూరు రూరల్ లో రోడ్ షో జరుగుతుందన్నారు. వి.ఆర్.సి. నుంచి నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారా యణ ఆధ్వర్యంలో రోడ్ షో జరుగుతుందన్నారు. రాష్ట్రమంతటా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్, నారా లోకేష్ పర్యటనలు చేస్తుంటే ప్రజలు నీరాజనాలు పలుకుతూ జన సునామీలా తరలి వస్తున్నా రన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సేవ చేసేందుకే వచ్చాం..

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

ప్రతి సామాజిక వర్గానికి అందరికీ ఉపయోగపడేలా నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో రూపొందించారని పేద ప్రజలకు వరం లాంటిదని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పేర్కొన్నారు.50వ డివిజన్లోని రంగనాయకులపేట, ఆనం రమణారెడ్డి వీధి , ..13వ డివిజన్ యాప దొరువు, పలు ప్రాంతాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి బాబు షఉరిటీ ,భవిష్యత్తు గ్యారెంటీ ,సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు, నెల్లూరును అభివృద్ధి పరచాలని ప్రజాసేవ చేసేందుకు వి,పి,ఆర్, నారాయణ లను సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

395 మద్యం సీసాలు సీజ్

ప్రజాశక్తి-నెల్లూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా చేస్తున్న 395 మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారని ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిట్రగుంట పరిధిలో–80, జలదంకి– 45, దగదర్తి–41, మనుబోలు–15 ఎఫ్‌జె వాష్ –1600 లీటర్లు , ఎస్‌ఈబి –219 మద్యం బాటిల్స్ లను పోలీసులు సీజ్ చేశారన్నారు. జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాలలో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, నాటు సారా, గంజాయి మొదలగు ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. తగిన రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మర్రిపాడు పరిధిలో 45 వేలు విలువ గల టిడిపి పంప్లేట్స్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు రూ.50వేలకు మించినగదు, ఎక్కువ నగలు తీసుకెళ్లొద్దని, ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు, ధృవీకరణ పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంద న్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ తప్పనిసరిగా పాటించాల న్నారు.ఎక్కడైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించిన యెడల సి–విజిల్ యాప్ ద్వారా (లేదా) టోల్ ఫ్రీ నంబర్ డయల్ 112 లేదా దగ్గరలోని సంబంధిత పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయవచ్చు.. అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రజాశక్తి
శుక్రవారం 3 మే 2024

బిడ్డల భవిష్యత్తు కోసం కృషి

ప్రజాశక్తి నెల్లూరు సిటీ: మన బిడ్డల భవిష్యత్తు కోసం..ప్రపంచ నగరాలతో పోటీపడేవిధంగా అద్భుత రాజదాని నిర్మించేందుకు నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, అందుకే ఆయన ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఎంతైనా ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. దేవరపాలెంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే పరిశ్రమలు వస్తాయని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తారని, ఉద్యోగం వచ్చేంతవరకు 3వేల రూపాయల నిరుద్యోగ భృతి అందిస్తారన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ 24 గంటలు సేవలు అందిస్తున్నానన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విడవలూరు:: గ్రామంలోని 232 బూత్ పరిధి లో పటేల్ నగర్, ముసలా ఒడ్డిగుంట మజరా ల్లో విడవలూరు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు చలంచర్ల కామేశ్వరి, నీరుకట్టు భవాని ఆధ్వర్యంలో గురువారం మహిళలు కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ఎన్నికలో ఎంపీగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రజాశక్తి-వెంకటాచలం: న ర్వేప ల్లి నియోజకవర్గం లో సైకిల్ ప్రభంజనం సునామిలా ఉంటుందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. వేద యపాలె ంలో ఉన్న సోమిరెడ్డి కార్యాల యంలో గురువారం మండలంలోని తిక్కవరపాడు, వెంకటాచలం గ్రామాల నుంచి 35 కుటుంబాలతో సహా వెంకటా చలం మాజీ ఉప సర్పంచ్ గంట బాబు వైసీపీని వీడి సోమిరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వీరందరికీ సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు.

ప్రజాశక్తి-మనుబోలు :తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాలన సంక్షేమం, అభివృద్ధి అయితే జగన్ పాలన విధ్వంసక పాలన అంటూ సోమిరెడ్డి శృతి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మనుబోలు మండల పరిధిలోని జట్ల కొండూరు పంచాయతీ పరిధిలో తన మామ టిడిపి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మద్దతుగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.

ప్రచారంలో ఇంటూరి సతీమణి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణం ఒకటో వార్డు ఎస్టీకాలనీ, 23 వ వార్డు స్కందపురి సోమేశ్వరాలయం ప్రాంతాల్లో ఇంటూరి నాగేశ్వరావు సతీమణి సౌజన్య ఎన్నికల ప్రచారం చేశారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలతో కలిసి మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను స్థానికులకు వివరించారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని సౌజన్య కోరారు.కార్యక్రమంలో నియోజవర్గ బిజెపి సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వైభవం తెస్తా

ప్రజాశక్తి-కోవూరు

మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు నియోజకవర్గానికి పారిశ్రామిక వైభవం తీసుకొస్తానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ గత పారిశ్రామిక వైభవాన్ని తిరిగి తెస్తానన్నారు. ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి గతంలో ఈ ప్రాంతంలో ఉన్నా ధర్మల్ పవర్ స్టేషన్, ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఉన్న షుగర్ ఫ్యాక్టరీ ప్రదేశాలలో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీఇచ్చారు. మీరందరు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కోవూరు ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకొచ్చాక అన్ని వర్గాలను ఆదుకునే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఉచిత ఇసుక, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పథకాలు అమలు చేస్తామన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు చూడడమే లక్ష్యంగా పాలన చేసే చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రి చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సైకిల్ గుర్తు పై ఓట్లేసి తనను ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ని ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిరుమురు అశోక్ రెడ్డి, జెట్టి రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ యద్దల పూడి నాగరాజు, ఇంతా మల్లారెడ్డి, కాటంరెడ్డి భరత్ కుమార్ రెడ్డి, డీసీఎన్, రాఖీ, నాటక రాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాని సైనిక్ స్కూల్‌కు నంబర్ వన్ ర్యాంక్..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సొసైటీ ర్యాంకింగ్‌లో అదాని వరల్డ్ (సైనిక్)స్కూల్ మొదటి స్థానంలో ని లిచింది. సైనిక్ స్కూల్ సొసైటీ ప్రణాళికా అమలు పరిచే విధానంలో దే శంలోని 19 సైనిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ 19 స్కూళ్లలో కృష్ణపట్నం లోని అదాని వరల్డ్ (సైనిక్) స్కూల్ మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల మాట్లాడుతూ సైనిక్ పాఠశాలల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దేశ వ్యాప్తంగా రాష్ట్రాలు, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడ్‌లో సైనిక్ స్కూల్స్ సొసైటీ, రక్షణ మంత్రిత్వ శాఖ కింద 100 కొత్త సైనిక్ స్కూల్‌లను స్థాపించే చొరవను భారత ప్రభు త్వం తీసుకుందని తెలిపారు. అందులో భాగంగా ఇది వరకే 19 కొత్త సైనిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విలువ-ఆధారిత విద్యతో పాటుగా , దేశం గొప్ప సంస్కృతి వారస త్వంపై గర్వాన్ని పెంపొందించడానికి వీలు కల్పించారని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, సాయుధ దళాలలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచడం అదానీ సైనిక్ స్కూల్ లక్ష్యమని తెలియజేశారు. ఏర్పాటు చేసిన 19 సైనిక్ స్కూల్స్‌లో కృష్ణపట్నంలోని ఆదాని వరల్డ్ సైనిక్ స్కూల్ మొదటి స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ప్రపచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-లింగసముద్రం

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.నెల్లూరు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కొప్పొలు రాజుకి మద్దతుగా కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని లింగసముద్రం మండలంలో గ్రామాలలో ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం చేశారు.ఇంటింటికీ ఇందిరమ్మ అభయా హస్తం పేరుతో కరపత్రాలు పంచి పెట్టారు.ఈ సందర్భంగా శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ పేద దళిత కుటుంబంలో పుట్టి ఈరోజు దేశ స్థాయిలో కొప్పుల రాజు పేరు మారుమోగుతుందంటే అది కేవలం పేదలు కు చేసిన సేవ వల్ల అని తాను నెల్లూరు కలెక్టర్ గా ఉన్నప్పుడు అనేక వందల మందికి ఆదర్శ వివాహాల్ని ప్రోత్సహించి అంబేద్కర్ వారసుడుగా నిలిచారన్నారు. పేదలకు భూములు పంచడంలో కీలక పాత్ర వహించి.ఏ ఊరిలో వాళ్లు ఆ ఊరిలో పని చేసుకునే విధానాన్ని రూపకల్పన చేసిన మహోన్నత వ్యక్తి కొప్పుల రాజు అని అన్నారు. కొప్పుల రాజులాంటి వ్యక్తిని గెలిపించడం మన బాధ్యత అని తెలిపారు,ప్రచారంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బాల కోటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కోటేశ్వరరావు, లింగసముద్రం అంబేద్కర్ యువత నాయకులు పవన్ కుమార్, యాకోబు మోష, తదితర నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

ప్రచారం చేస్తున్న బుర్రా

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఏడవ సచివాలయం తూర్పు వడ్డే పాలెం 12వ వార్డు పరిధిలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసిపి కందుకూరు నియోజకవర్గం అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి కందుకూరు సమగ్ర అభివృద్ధి చెందాలన్న, నియోజకవర్గం సంక్షేమ బాట పట్టాలన్న పిసిపి అభ్యర్థి అయిన తనను బుర్రా మధుసూదన్ యాదవ్ గెలిస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. అందుకే ఓటర్ మహాశయులందరూ నన్ను ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేణుంబాక విజయ్ సాయి రెడ్డి కి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసి మన నియోజకవర్గంలో నుంచి అత్యధిక మెజార్టీ తెప్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, సచివాలయం కన్వీనర్ పిడికిటి శంకర్, బాలినేని అజయ్, లవ కుమార్, ప్రభాకర్, గణేష్ గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు

ఉలవపాడు మండలం హరిజనవాడ కు చెందిన తెలుగుదేశం నాయకులు గురువారం తెలుగుదేశం పార్టీని వీడి కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

తూతూమంత్రంగా సమావేశం

ప్రజాశక్తి-మనుబోలు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మనుబోలు మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. గురువారం ఎంపీపీ వజ్రమ్మ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల మీట్‌ను నిర్వహిం చారు. ఎన్నికల నేపథ్యంలో ఈ సర్వసభ్య సమావేశానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. సాదాసీదాగా నిర్వహించారు. ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ గ్రామాల్లో తీవ్ర వేసవిని ఎదుర్కొనేందుకు అధికారుల అప్రమత్తమై చర్యలు తీసుకోవా లన్నారు. ఎక్కడ నీటి ఎద్దడి సమస్య రాకుండా చూడాలన్నారు. వైద్యాధికారి మొహసిన్ సుల్తానా మాట్లాడుతూ ఉష్ణోగ్రత ఎక్కువగా పెరుగుతున్న కారణంగా ఉదయం 11 గంటలు దాటితే ఎవరు బయటకు రావద్దు అన్నారు. గ్లూకోజ్, ఓ ఆర్ ఎస్ వాటర్ ను తీసుకోవా లన్నారు. గ్రామాలలో గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీలు గుమ్మడి వెంకటసుబ్బయ్య, దువ్వూరు రాజేశ్వరమ్మ, గుండాల శిరీష, కో ఆప్షన్ సభ్యులు నాగూర్ బాషా, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ కార్తీక్ రెడ్డి, పంచాయతి రాజ్ డిఇ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జెండా అవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద ఉన్న సంఘ సిఐటియు జెండాని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కే మాలాద్రి గురువారం ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఆదామ్ పాల్గొన్నారు సంఘ గౌరవ అధ్యక్షులు ఎస్ఎ గౌస్ కమిటీ సభ్యులు ఎస్కె రంతుల్లా , ఎ.వెంకట్రావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి సమయంలో నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న హత్య ఘటనకు సంబంధించిన పుట్టా బాలాజీ, పుట్టా చంద్రశేఖర్, తుమ్మా శ్యాం, అవర బాబు, కూచిపూడి శ్రీచరణ్ , కూచిపూడి వైభవ్ అను ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో కూచిపూడి శ్రీచరణ్, కూచిపూడి వైభవ్‌లు మైనర్లని పోలీసులు తెలిపారు. గురువారం నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ ఎం.బాబి నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. పుట్టా బాలాజీ అనే వ్యక్తి మోటారు సైకిల్ అతివేగంగా నడుపుండగా , అంత స్పీడ్‌గా ఎందుకు మోటారు సైకిల్ నడుపుతున్నావు .. ఎందుకు అని సౌజిద్, సుల్తాన్ అను వ్యక్తులు ప్రశ్నించారు. మాటా..మాటా పెరిగి కొట్టగా పుట్టా బాలాజీ గాయపడ్డారన్నారు. గాయపడిన పుట్టా బాలాజీ తనను కొట్టిన వారిపై ప్రతీకారం తీసుకోవాలన్న ఆలోచనతో కుసుమవాడకు వెళ్ళి తోటి స్నేహితులతో కలిసి వచ్చి సాజిద్, సుల్తాన్‌లపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ సమయంలో దాడిని అడ్డుకొనే ప్రయత్నం చేసిన రవితేజ పై నిందితులు కత్రలతో దాడి చేయడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడన్నారు. మృతుడు తండ్రి గ్రంధే శేషాద్రి ఫిర్యాదు మేరకు , ఎస్‌పి కె.ఆరీఫ్ ఆదేశాలతో, ఏఎస్‌పి సిహెచ్ సౌజన్య సూచనల మేరకు నగర డిఎస్‌పి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకోని విచారణ వేగవంతం చేశామన్నారు. హత్యా ఘటన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితులను పుల్లమ్మ సత్రం వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అదే సమయంలో హత్యకు వినియోగించిన కత్రలు, దుస్తులు, మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసు విచారణలో ప్రతిభను కనపరిచిన సిబ్బందిని ఎస్‌పి అభినందించారన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
శుక్రవారం 3
మే 2024

'పసుపులేటి' విస్తృత ప్రచారం

విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న పసుపులేటి సుధాకర్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలోని ఎస్‌జివి కండ్రిక, బిజిబి కండ్రిక, జక్కపల్లి గూడూరు, సోమేశ్వర పురం, ఎపి కండ్రిక, నాగులవరం, ఎకె కండ్రిక, తాళ్లూరు, కొండ బిట్రగుంట, పాత బిట్రగుంట, బోగోలు, విశ్వనాథరావుపేట, బేతనిపేట, కడనూతల, కోరుపల్లి, ఉమామహేశ్వరపురం, సిద్దన్నపాలెం, ఎస్‌వి పాలెం, అల్లిమడుగు, గ్రామాలలో గురువారం ఇండిపెండెంట్ ఎంఎల్‌ఎగా పోటీ చేస్తున్న పసుపులేటి సుధాకర్ విస్తృత ప్రచారాన్ని రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి ప్రజలకు ఎన్నో సేవలు చేశామని, ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో రాజకీయాల్లోకి వస్తున్నానని, ప్రజలు సేవ చేసుకునేందుకు అవకాశం ఇస్తే కావలి నియోజకవర్గాన్ని అభివద్ధి బాటలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పసుపులేటి వెంకటేశ్వర్లు, ప్రత్యూష, కృష్ణ, పసుపులేటి యువసేన, పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పొలం పత్రాలపై సిఎం ఫొటో దారుణం

ప్రజాశక్తి-కావలి

ప్రజలు కష్టపడి సంపాదించిన ఆస్థి పొలం పత్రాల అడంగల్స్ పైన రాజముద్ర మాత్రమే ఉండాలి.. కానీ జగన్ ప్రభుత్వంలో రాజముద్రతో పాటు జగన్ బొమ్మ ఎందుకు పెట్టారు అని సీనియర్ టిడిపి నేత పద్మావతి శ్రీదేవి ప్రశ్నించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు పత్రాలపై తన బొమ్మ వేసుకున్న జగన్, రేపు మన ఆస్తులపై మనకు హక్కు ఉంచుతాడా.. అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆ మేరకు టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని దాసరిపల్లి, వడ్లమూడి పల్లి, అప్పసముద్రం, తిరుమలపురం, చిన్నవారి చింతల గుడి, నరవ దుంపవారి పల్లి, వెంగళరావు నగర్, గండిపాలెం పంచాయతీల్లోని ఎస్‌సి ఎస్‌టి బిసి కాలనీల్లో గురువారం టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రతి పల్లెలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. యువత భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరినీ ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలు అందజేస్తూ ఓట్లను అభ్యర్థించారు. దాసరపల్లి అప్పసముద్రం ప్రతి గ్రామంలో వైసిపి నుండి టిడిపిలోకి భారీగా వలసలు వెళ్లి వెత్తాయి. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పట్టుకొమ్మల లాంటి పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించడం, గ్రావెల్ తరలించడం, దందాలు, కబ్జాలు తప్ప గత ఐదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వైసిపి రాక్షస పాలనకు చరమగీతం పాడాలని కోరారు. మేకపాటి రాజగోపాల్ రెడ్డిని గెలిపిస్తే ఉదయగిరి అంధకారం అవుతుందని, దోపిడీ, దౌర్జన్యాలు అధికమవుతాయని తెలిపారు. గెలవకమునుపే ఓటర్లను బెదిరిస్తున్నారని గెలిచిన తర్వాత వారి రౌడీయిజం ఎలా ఉంటుందో ప్రజల గమనించాలన్నారు. ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ తనను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అవ్వా తాతలను వద్ద ఆశీర్వాదాలు అందుకొంటు ఆడపడుచులను ఆప్యాయంగా పలకరిస్తూ అన్నదమ్ములను అక్కున చేర్చుకుని త్వరలోనే మీ కష్టాలు తీరుతాయని అభయమిచ్చారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా చంటి బిడ్డలను ఎత్తుకొని ముద్దాడుతూ సాగుతున్న ప్రచారంలో పల్లె జనం పూలవర్షం కురిపిస్తూ బాణాసంచాలు కాలుస్తూ, బ్యాండ్ మేళాలతో స్వాగతాలు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నుబోయిన చెంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ బయన్న, గానుగపెంట ఓబుల్ రెడ్డి, జల్సా మలిశెట్టి వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, ఎస్‌డి కాలేశా, ఎస్ డి.ఖాజా, ఎం.జిలాని, ఎస్ డి అగ్రం, ఎస్.కె మాముద్దీన్, సర్దార్, మహమ్మద్ అలీ, జాఫర్ ఆలీ, రామయ్య, గాడి వెంకటస్వామి రెడ్డి, శ్రావణ్ కుమార్, మద్దినేని కొండయ్య, విజయమ్మ, మద్దినేని మాలకొండయ్య, దారపునేని సునీల్, మద్దినేని నారాయణ, సిహెచ్ వెంకయ్య, మద్దినేని చంద్రమౌళి, ఎం.ఉషేనయ్యా, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ప్రచారంలో కాకర్ల సురేష్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

'మానుగుంట' కేంద్రంగా వైసిపి రాజకీయం

ఆయన మద్దతు లేనిదే గెలవలేమంటున్న ఆ పార్టీ అభ్యర్థులు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కేంద్రంగా వైసిపి రాజకీయం తిరుగుతోంది. ఇప్పటికే నాలుగు సార్లు శాసనసభ్యులుగా, రాష్ట్ర మంత్రిగా చేసిన మహీధర్ రెడ్డిని పక్కనపెట్టిన వైసిపి అధిష్టానం కనిగిరి శాసనసభ్యుడు బుర్రా మధుసూదన యాదవ్‌కు కందుకూరు అభ్యర్థిత్వం ఇచ్చిన విషయం తెలిసిందే. మధుసూదన్ యాదవ్ కందుకూరు ఇన్‌ఛార్జిగా వచ్చిన నాటి నుంచి మహీధర్ రెడ్డి మద్దతు కోసం ప్రయత్నాలు చేశారు. ఆయన మద్దతు కోసం బుర్రా మధుసూదన్ యాదవ్ తో పాటు నెల్లూరు పార్లమెంటు వైసిపి అభ్యర్థి విజయసాయిరెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. మహీధర్ రెడ్డి స్వగ్రామమైన మాచవరం వెళ్లి కలిశారు. తమ విజయానికి కషి చేయాలని కోరారు. వైసిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు చేసిన కందుకూరు ప్రాంత కాంట్రాక్టర్లకు రావల్సిన బిల్లులు రాలేదని ఆ బిల్లులు చెల్లించే విధంగా చూడాలని విజయ్ సాయి రెడ్డిని మహీధర్ రెడ్డి కోరారు. ఆ తర్వాత కార్యకర్తల సమావేశం నిర్వహించి వారికి పరిచయం చేస్తానని చెప్పారు. బిల్లులు చెల్లించిన తర్వాత కందుకూరు వెంగమాంబ ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం జరిపి విజయ్ సాయి రెడ్డి, బుర్ర మధుసూదన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని మహీధ రెడ్డి సూచించారు. మహీధర్‌రెడ్డి మద్దతు లేకుండా ఈ నియోజకవర్గంలో గెలవడం కష్టమని బిజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. సామాజిక సమీకరణల కారణంగా మహీధర్ రెడ్డికి ఈసారి కందుకూరు ఇవ్వలేకపోయామని, 2026లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మళ్లీ మహీధర్‌రెడ్డికి వైసిపి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఎంఎల్‌సిగా మహీధర్ రెడ్డి కి పదవి ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని విజయ్ సాయి రెడ్డి చెప్పారు. ఆ సమావేశంలో మహీధర్ రెడ్డి ఎంఎల్‌సి పదవి విషయం సున్నితంగా తిరస్కరించారు. మరో అడుగు ముందుకేసి కందుకూరు నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మహీధర్ రెడ్డి ఏది చెబితే అదే జరుగుతుంది అని చెప్పటం విశేషం. సమావేశం అనంతరం మహీధర్ రెడ్డి తోవున్న క్యాడర్ ఎక్కువ మంది వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన యాదవ్ వద్దకు వెళ్లి పనిచేయడం ప్రారంభించారు. కొంతమంది తెలుగుదేశం పార్టీలో చేరి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం కృషి చేస్తున్నారు. మహీధర్ రెడ్డి మాత్రం వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం బహిరంగంగా ప్రచార కార్యక్రమాల్లో ఎక్కడా పాల్గొనడం లేదు. ఈనెల 24న బుర్రా నామినేషన్ కార్యక్రమంలో వాహనంపై ఎక్కి మధ్యలో దిగిపో యారు. ఈనెల 28న కందుకూరులో జరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార వాహనంపై మహీధర్ రెడ్డి కనిపించారు. మహీధర్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని సభా వేదికపై నుంచి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పారు. తమకు మారుమాట లేకుండా బిసి అభ్యర్థిని కందు కూరు ఎన్నికల బరిలో నిలుపుతానని చెప్పిన వెంటనే సహకరి సానన్న మహీధర్ రెడ్డిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని జగన్మోహన్ రెడ్డి చెప్పటం అంటే వైసిపి రాజకీయం మహీధర్ రెడ్డి చుట్టూ ఎలా తిరుగుతోందో అర్థం చేసుకోవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ

విజయసాయిరెడ్డి, వైసిపి ఎంపి అభ్యర్థి



బుర్రా మధుసూదన్ యాదవ్, వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి

లోకల్.. నాన్ లోకల్..!

-నేను పక్కా లోకల్ : ఇంటూరి
-నేను కందుకూరులోనే పుట్టా : బుర్రా
-దుమారం రేపుతున్న జిల్లా మార్పు అంశం
-రసవత్తరంగా కందుకూరు రాజకీయం

ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి కూటమి అభ్యర్థి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు రెండు అంశాలు ప్రధానంగా ఎన్నికల ప్రచారానికి అస్త్రంగా మారాయి. లోకల్, నాన్‌లోకల్ తోపాటు జిల్లా మార్పు విషయం ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ఉన్నాయి. ఎన్నికల ప్రచారం ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి వైసిపి ముమ్మరంగా సాగిస్తున్నాయి. వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనాకాలంలో సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందించడం ద్వారా ప్రజలకు మేలు జరిగిందని ప్రచారం చేస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి రూ. లక్షల కోట్లు బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలకు పంపాడని, ఇలాంటి సంక్షేమం గతంలో ఎవరు చేయలేదని ప్రధానంగా మధుసూదన్ యాదవ్ ప్రజలకు ప్రచారంలో ప్రజలకి వివరిస్తున్నారు. జగన్ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి కుటుంబం తనకు ఓటు వేస్తారని చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయనే ప్రచారం ప్రజల్లో ముమ్మరంగా చేస్తున్నారు.

కందుకూరు టిడిపి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వర రావు ప్రచా రం ప్రభు త్వ వ్యతిరేక విధానాలపై ఎగ్గుపెట్టి సాగిస్తున్నారు. వైసిపి అభ్యర్థి బుర్రా మధు సూదన్ యాదవ్ నాన్ లోకల్ అని, ఆయనకి ఓటు వేస్తే ప్రజలకు అందుబాటులో ఉండడని పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. కనిగిరిలో గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజల్లో ఆయన విధానాల కారణంగా వ్యతిరేకత తీవ్రస్థాయిలో రావటం వల్ల ఓటమి తప్పదని భావించి సిఎం జగన్మోహన్ రెడ్డి కందుకూరుకి పంపారని ఇంటూరి తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. కనిగిరిలో పనికిరాని వ్యక్తి ఇక్కడ ఎలా పనికొస్తారని తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. దీనికితోడు ప్రకాశం జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో జగన్ ప్రభుత్వం కలిపి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందనే అంశం కూడా ప్రధానంగా టిడిపి ప్రచారాస్త్రంగా కొనసాగిస్తుంది. ఈ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల ఛార్జీలు పెంచడంతోపాటు నిత్యవసర ధరలు పన్నులు పెంచడం ద్వారా ప్రజలపై భారాలు పడ్డాయి అనే ప్రచారం చేస్తున్నారు.టిడిపి చేస్తున్న ప్రచారానికి వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ తో పాటు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జూపూడి ప్రభాకర్ రావు కూడా స్పందించి కౌంటర్ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. తాను కందుకూరు నియోజకవర్గంలోని కంచరగుంట గ్రామంలో పుట్టాను.' మా అమ్మమ్మ ఊరు కంచరగుంట గ్రామం అని పదేపదే ప్రచారం సందర్భంగా చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో అడుగు ముందుకు వేసి నారా లోకేష్ ఎక్కడివారు.. మంగళగిరిలో పోటీ చేయడం లేదా? నారా చంద్రబాబునాయుడుది కుప్పం నియోజకవర్గం కాదు పోటీ చేయడం లేదా ? జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పోటీ చేయడం లేదా అని అని జూపూడి తో పాటు బుర్రా మీడియా సమావేశంలో చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కందుకూరు జిల్లా మార్పు అంశం కూడా పెద్ద దమారమే లేపుతుంది. టిడిపి అధికారంలోకి వచ్చిన 3 నెలలకే ప్రకాశం జిల్లాలో కందుకూరు కలుపుతామని నాగేశ్వరరావు పదేపదే ప్రచారం చేస్తున్నారు. 2026లో రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్ విభజన జరుగుతుందని అప్పుడు కందుకూరు తప్పకుండా ప్రకాశం జిల్లాలో కలుపుతామని వైసిపి అభ్యర్థి బుర్రా మధు సూదన్ యాదవ్ చెప్పుకొస్తున్నారు. వైసిపి రాష్ట్ర నాయకుడు జూపూడి ప్రభాకర్ రావు మాత్రం జిల్లా ఏర్పాటుకి ప్రభుత్వానికి సంబంధం లేదని ఐఏఎస్ ఆఫీసర్లు పార్లమెంట్ నియో జకవర్గాల పరిధిని బట్టి చేశారని తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి విజయసాయిరెడ్డి అయితే టిడిపితో పొత్తులో ఉన్న బిజెపి కేంద్రంలో అధికారంలో ఉంది వారు ఆదేశిస్తే కందుకూరు నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాలో కలపటం సులభం అన్నారు. లోకల్, నాన్‌లోకల్ జిల్లా మార్పు ప్రచారాలు ఎంతవరకు ఏ పార్టీకి లబ్ధి చేకూరు స్తాయో కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

బుర్రా మధుసూదన్ యాదవ్, వైసిపి అభ్యర్థి

కందుకూరు

విజయసాయిరెడ్డి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సంక్షేమం, అభివృద్ధిని కోనసాగించేందుకు జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎంపిగా తనను, ఎంఎల్‌ఎగా మేకపాటి విక్రమ్ రెడ్డిని ఆశీర్వదించాలని నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి కోరారు. ఆత్మకూరు పట్టణ పరిధిలో పలు వార్డుల్లో ఎంఎల్‌ఎ అభ్యర్థి మేకపాటి విక్రమ్ రెడ్డితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టౌన్‌లో ఏ వార్డుకు వెళ్లిన వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థులకు మహిళల, యువకులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. తొలుత పట్టణంలోని సుల్తాన్ షాహిద్ దర్గాలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లీం మైనారిటీలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వార్డుల్లో భారీ అభిమాన జనసందోహం నడుమ ర్యాలీ కార్యక్రమం కొనసాగింది. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టిడిపి ఆత్మకూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి తన స్వలాభం కోసం పార్టీలు మారుతున్నాడని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి సిఎం జగన్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుటిల స్వభావం, నిలకడలేని ఆయనకు ఆత్మకూరు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆత్మకూరు అభివృద్ధికి తన దివంగత సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా విక్రమ్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేసి జనాదరణ పొందుతున్నారని కోనియాడరు. ఇందుకోసం ఆయన ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరమ్ (ఎడిఎఫ్) ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారని తెలిపారు. రూ.20లక్షలతో ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేశారని తెలిపారు. గత ఒకటిన్నర సంవత్సరాల్లో మూడు సార్లు ఎడిఎఫ్ ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాలలో ప్రసిద్ధ కంపెనీల్లో 6వేల మందికి ఉద్యోగాలు కల్పించడం మంచి పరిణామాని తెలిపారు. గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రూ.4లక్షల విలువైన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారన్నారు. మేకపాటి గౌతమ్ రెడ్డి (ఎంజిఆర్) ఫౌండేషన్ నిధులతో (రూ.4.5 కోట్లు) ఆత్మకూరు బస్టాండ్‌ను కొత్త హంగులతో ఆధునికీకరించారని పేర్కొన్నారు. వారివెంట జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, ఐవి రమణారెడ్డి, నందా ఓబులేసు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థులు

ప్రజాభివృద్ధికి కృషి చేసే పార్టీలకే

ఓటు వేయండి : ఉమెన్ ఫోర్స్

ప్రజాశక్తి-కావలి : మే 13వ తేదీ జరుగనున్న సార్వత్రిక ప్రత్యక్ష ఎన్నికల్లో "రాజ్యాంగం ప్రసాదించిన శక్తివంతమైన ఓటు హక్కు ఆయుధాన్ని "ఉపయోగించుకుని చిత్తశుద్ధితో 18యేళ్ళ నిండిన యువత నుండి వృద్ధుల వరకు వయోజనులందరూ పోలింగ్ కేంద్రాలకు స్వచ్ఛందంగా తరలివెళ్లి, ప్రజాభివృద్ధికి కృషి చేసే పార్టీలకే ఓటును వేయాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మత ఛాందస్స శక్తులను నేలమట్టం చేస్తూ లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించి, పరిరక్షించే రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయాలని వారు కోరారు. ముస్లిం - క్రైస్తవ మతస్తుల హక్కులను, పౌరసత్వాన్ని కాపాడే పార్టీని ఎంచుకుని ఓటేసి, స్వచ్ఛమైన కుల మతాలకు అతీతంగా దేశాభివృద్ధిని, నిమ్నజాతుల అభివృద్ధి, సంక్షేమం చేసే రాజకీయపార్టీలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. జాతి నేతలు తమ త్యాగాలతో సాధించి తెచ్చిన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించే రాజకీయ పార్టీల అభ్యర్థులను గెలిపించాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు విడుదల చేసిన మోసపూరిత - మాయలమారి మేనిఫెస్టోలను గుడ్డిగా నమ్మకుండా, వారు ఇస్తామని ఆడజూపే వస్తువులు, డబ్బు, మద్యం ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. మనం వేసే ఓటు "మన దేశ ప్రజల భవిత కష్టాలమయం కాకుండా ఉండేందుకే" అని గుర్తుంచుకుని ఓటెయ్యాలని కోరారు. చీరలు, పసుపు కుంకుమ ఆకర్షణలకు మహిళలు లొంగిపోరాదన్నారు. పేద బడుగు వర్గాల ప్రగతి సాధిస్తుందని నమ్మకం కల్గిన పార్టీ అభ్యర్థులెవరో గమనించి వారిని గెలిపించాలని కోరారు. "ఓటేసే వరకే ప్రజలు తర్వాత ముఖం చూపని "పార్టీల అభ్యర్థులకు బుద్ధి వచ్చేలా ఓటు ఆయుధాన్ని వినియోగించాలన్నారు. 'మనమే ప్రభుత్వాన్ని నిర్మించే అజేయ శక్తి' అని ప్రతిఓటరూ గుర్తించాలన్నారు. కొత్తగా ఓటుహక్కు పొందిన యువ - నవ ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటు విలువను చెపుతూ, పోలింగ్ కేంద్రాలకు వెంటబెట్టుకుని వెళ్లాలన్నారు. ఏ పార్టీ అభ్యర్థులు ఏర్పాటు చేసిన వాహనాలలోనూ ఎక్కకుండా స్వయంగా ఆ ఏర్పాట్లు చేసుకుని, పోలింగ్ స్టేషన్లకు వెళ్లడం మన ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఓటు కోసం ఒకరోజు వచ్చిన - తీసుకున్న డబ్బు, బహుమానం, మద్యం దేశం, రాష్ట్రం మొత్తపు ప్రజాస్వామ్య ప్రభుత్వ నిర్మాణంలో పాలల్లో చుక్క విషం కారాదన్నారు. ఎండతీవ్రత పెరగక ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటేసివచ్చి, వ్యక్తిగత -ఇంటి పనులు చేసుకోవచ్చు, ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని, దేశ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. ఎన్నికలలో ఓటర్లు అప్రమత్తతతో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కావలి ఉమెన్ ఫోర్స్ సభ్యులు సి.శారద, షేక్.ఫాతిమా, షేక్.నూర్జహాన్, టి.సుజాత, చైతన్య, రాజ్యలక్ష్మి, తదితర సభ్యులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఇండియా కూటమిని గెలిపించుకుందాం..

ప్రజాశక్తి-ఉదయగిరి

ఇండియా కూటమిని గెలిపించుకొని దేశాన్ని కాపాడుకుందామని నెల్లూరు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక షాదీమంజిల్‌లో ముస్లిములతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం కోసం ఎందరో ముస్లిం నాయకులు ప్రాణార్పణ చేయడం తోపాటు ఆస్తులు కూడా వెచ్చించారన్నారు. భారతీయ జనతా పార్టీ పది సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తూ మతాలను కులాలను రెచ్చగొడుతుందన్నారు. ముస్లిములు ధరించే దుస్తులపై తిండిపై ఆంక్షలు పెడుతున్నారని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తపరిచారు. జరగనున్న టిడిపి ఎన్నికల్లో బిజెపి అధికారంలోకొస్తే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే బిజెపి వేసినట్టేనని తలిపారు. గతంలో ఈ జిల్లాకు కలెక్టర్‌గా పని చేసినప్పుడు ఎన్నో సంస్కరణలు తెచ్చి అభివృద్ధి చేశానని తెలిపారు. మే 13న జరిగే పోలింగ్ రోజున పార్లమెంట్ అభ్యర్థిగా కొప్పుల రాజు, అసెంబ్లీ అభ్యర్థిగా సోము అనిల్ కుమార్ రెడ్డిలకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు బాలయ్య సిపిఎం నాయకులు ఫర్దిన్, కాకు వెంకటయ్య, ఎంపిటిసి కాకు విజయమ్మ, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి కొప్పుల రాజు

వీరేంద్ర చౌదరికి సన్మానం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని జగదేవిపేట గ్రామంలో టిడిపి యువ నాయకులు వేళ్ల మౌర్యనాయుడు ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు రావెళ్ళ వీరేంద్ర చౌదరికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవి వరించిన సందర్భంగా టిడిపి నేతలతో కలిసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరిని పలువురు టిడిపి నేతల శాలువాతో సత్కరించారు. అనంతరం అభిమానుల మధ్య కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ టిడిపి కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి వీరేంద్ర నాయుడు అని అన్నారు. నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడు వీరేంద్ర నాయుడు శ్రమను గుర్తించి రాష్ట్ర పదవిని ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ నాయుడు, నాగార్జున నాయుడు, సురేష్ నాయుడు, రవి నాయుడు, విజయ్ గోపాల్‌నాయుడు, రాధాకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లికార్జున నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ప్రయోజనాల కోసం కృషి

-వైసిపి యువనేత నేహారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

ముస్లిముల ప్రయోజనాలు కాపాడేందుకు , వారి హక్కుల పరిరక్షించేందుకు జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైసిపి అహర్నిశలూ శ్రమిస్తోందని ఆ పార్టీ యువనేత, నెల్లూరు ఎంపి అభ్యర్థి విజయసాయి రెడ్డి కుమార్తె నేహారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని 42వ డివిజన్ ప్రాంతంలో సిటి అసెంబ్లీ పోటీ చేస్తున్న వైసిపి అభ్యర్థి ఖలీల్ అహ్మద్ సతీమణి నసీమా బేగం, కార్పొరేటర్ షేక్ కరీముల్లా, పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి అత్యంత ఆదరణ లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. జగనన్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయని ప్రజలు స్వచ్ఛందంగా చెప్పడం మరింత సంతోషం కలిగిస్తోందన్నారు. డివిజన్లో కార్పొరేటర్, వాలంటీర్లు ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని ఇక్కడి ప్రజలు చెబుతున్నారన్నారు. ఈ మేరకు మే 13న జరగనున్న పోలింగ్ లో ఎంఎల్‌ఎ గా ఖలీల్ అహ్మద్ ని, ఎంపీగా తన తండ్రి విజయసాయి రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎంఎల్ఎ ఖలీల్ అహ్మద్ ఎన్నికల గుర్తు ఈవిఎంల్లో 3వ క్రమ సంఖ్యలో ఎంపీ ఈవీఎంల్లో తన తండ్రి విజయసాయి రెడ్డి క్రమ సంఖ్య 4 అని ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జి షేక్ జాహిద్, పార్టీ నేతలు మహమ్మద్ అహ్మద్, ఖాసిం బాషా, చాన్ బాషా, ఖాదర్ భాయ్, సంధాని, మహిళా నేతలు జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కర్రం జ్యోతి, మాధవి వర్మ, బెందాళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కసరత్తు

ప్రజాశక్తి కోవూరు

జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపుకొరకు టీడీపీ శ్రేణులు నాయకులు తో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది పోతిరెడ్డిపాలెం లో తిరుమూరు అతిధి గృహం నందు టీడీపీ ఆత్మీయ సమావేశము నిర్వహించారు.గ్రామ స్థాయి టీడీపీ నేతలు నాయకులు కార్యకర్తలు తో సమీక్ష కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా తిరుమూరు అశోక్ రెడ్డి మాట్లాడుతూ గెలుపు దిశగా అందరూ సమిష్టిగా పని చేసి టీడీపీ అభ్యర్థులు విజయానికి కృషి చెయ్యాలని అన్నారు టీడీపీ అధికారం లోకి వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుంది అని అన్నారు ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ యద్దల పూడి నాగరాజు, జి నాగరాజు, మాజీ సర్పంచ్ కష్ణప్రసాద్, మాజీ కోఆప్షన్ జహంగీర్,తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

చివరి దశలో ఉన్న మనబడి నాడు - నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి బిసి తెలుగు పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు - నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి దశలో కొనసాగుతున్న పాఠశాల మొదటి అంతస్తు పనులను పరిశీలించి నెలలో పాఠశాల మనబడి నాడు - నేడు విజిట్ వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్న వాష్ బేసిన్స్ మొదటి అంతస్తు మెట్ల దగ్గర పైన రూఫింగ్ పనులు పూర్తి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి నాగయ్యను ఆదేశించగా, వెంటనే పనులను పూర్తిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. పాఠశాల మొదటి అంతస్తు వరండా లో గ్రిల్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపి పలు సూచనలు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో తప్పనిసరిగా పాఠశాల అడ్మిషన్స్ బాగా పెంచాలని నాడు - నేడు పనులు చివరి దశలో ఉన్న పాఠశాలలు నిధుల కొరత ఉన్న ఎడల మండల విద్యాశాఖ అధికారి వారి దృష్టికి తెచ్చిన నిధులు ఉన్న పాఠశాల నుండి వీలైనంత త్వరగా మంజూరు చేయిస్తానని తెలిపారు.

నాడు - నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఇఒ-2 శ్రీనివాసులు

కాకర్ల రుక్మిణి పర్యటన

ప్రజాశక్తి-సీతారామపురం

టిడిపి ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని సీతారామ పురం, చిన్ననాగంపల్లి గ్రామాల్లో కాకర్ల రుక్మిణి పర్యటించారు. ఇంటింటికి తిరిగి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఉమ్మడి కూటమి టిడిపి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొదవటికంటి భాగ్యమ్మ, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సీనియర్ నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, మాజీ యంపిటిసి సోమనబోయిన రాజశేఖర్, తెలుగు యువత కార్యదర్శి ఎ.రఘు రామయ్య, టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ఆలూరు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మాల కొండయ్య జనసేన మండల ఇన్‌ఛార్జి పాలిశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం కేంద్రంలో టిడిపి నాయకులు ముప్పాళ్ళ వెంకట్ చౌదరి, మాలపాటి వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీనివాసులు నాయుడు, పుల్లయ్య, చిలకపాడు, శెట్టి సముద్రం గ్రామాల్లో మండల అధ్యక్షులు అరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ అధ్యక్షులు నారాయణ, మధుసూదన్ రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాలు గూర్చి ప్రజలకు వివరించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టి వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపి వేసిన పలుసంక్షేమ పథకాలను చంద్రబాబు ప్రవేశ పెట్టనున్నట్లు మేనిఫెస్టోలో చేర్చారన్నారు. మే 13న జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో, ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యలగాల వెంకటేశ్వర్లు, విజయ భాస్కర్ రెడ్డి, యానాది రెడ్డి, గానుగపెంట యానాది, పుల్లారెడ్డి, ఇస్మాయిల్, కె.ప్రసాద్, నరేష్, నాయబ్ ఓబులేసు, బాలయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సీతారామపురం

ఉదయగిరి ప్రాంత అభివృద్ధి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరురాజు పేర్కొన్నారు. గురువారం సీతారామపురంలోని కురవ వీధి, కంసాలి వీధులలో ఆయన వైసిపి ఎంపి అభ్యర్థి వేణుబాక విజయసాయిరెడ్డి, ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డిలకు అత్యధిక మెజార్టీ వచ్చేలా ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆదరించాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి విజయంతో అత్యంత వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపి విజయసాయిరెడ్డి నెల్లూరు జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక మేనిఫెస్టోను తయారు చేశారని తెలిపారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి హామీని విజయసాయిరెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఇద్దరూ కచ్చితంగా అమలు చేస్తారన్నారు. ఉదయగిరి ప్రాంతంలోని ప్రజలందరికీ అభివృద్ధిని చూపిస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం ద్వారా ప్రతి పేదవాడు వైసిపిపై అత్యంత అభిమానం చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు లబ్ధిదారులు ఇళ్ల వద్దకే చేరాయన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు భవిష్యత్తును చూపాడన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో పులివెందుల తర్వాత ఉదయగిరి నియోజకవర్గం వైసిపికి అత్యధిక మెజారిటీ వచ్చిన నియోజకవర్గంగా నిలుస్తుదని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న పిసి అల్లూరు రాజు

రాష్ట్రంలో విధ్వంస పాలన

ప్రజాశక్తి-కావలి రూరల్

రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, మే 13న జరిగే ఎన్నికల్లో టిడిపికి ఓటేసి వైసిపికి బుద్ధి చెప్పనున్నారని టిడిపి నేతలు పేర్కొన్నారు. ఎన్‌డిఎ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్ రెడ్డి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులతో కలిసి మండల పరిధిలోని తుమ్మలపెంట నుండి కొత్తసత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ గజమాలతో గ్రామస్తులు స్వాగతం పలికారు. మహిళలు హారతులతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగించాడన్నారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. అరాచక ఎంఎల్ఎను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గంలో ఇక ఏమీ మిగలదన్నారు. పెంచిన పింఛన్లను ఏప్రిల్ నుంచి పరిశీలించి జూన్‌లో పెంచిన పింఛన్లను అందజేస్తామన్నారు. ఎంఎల్ఎగా కావ్య క్రిష్ణారెడ్డిని, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, జనసేన నాయకులు తిరుపతి స్వామి, నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, మత్స్యకార కాపులు, మత్స్యకారులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం కచ్చేరిమిట్ట నివాసులు శిఖరం.శ్రీనివాస వరప్రసాద రావు మూడో వర్ధంతి సందర్భంగా గురువారం వారి సతీమణి శిఖరం.సుజాత వారి కుమారులు సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా కావలి పట్టణం శివరామ సుబ్బయ్య గిరిజన కాలనీ, చెరువు కట్ట గిరిజన కాలనీ, జంగాల కాలనీలో 200మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ శిఖరం శ్రీనివాస వరప్రసాదరావు జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా 200మంది పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలు శిఖరం.సుజాతకు, వారి కుమారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

టిడిపి కండువా కప్పుతున్న కావ్యక్రిష్ణారెడ్డి

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని 22, 28, 32వ వార్డ్ ఇన్‌ఛార్జులు నాయబ్ రసూల్, అతని సతీమణి షేక్.షమీనా, నున్నా మురళీ, 32వ వార్డులో వల్లెపు కిషోర్‌లు గురువారం కూటమి అభ్యర్థి కావ్యా క్రిష్ణారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. క్రిష్ణారెడ్డి వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నున్నా మురళి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో నచ్చి, ప్రజలకు మేలు జరుగుతుందని భావించి టిడిపిలో చేరడం జరిగిందన్నారు. పార్టీలో చేరిన వల్లెపు కిషోర్ మాట్లాడుతూ 2019లో ప్రతాప్‌రెడ్డి విజయానికి కృషి చేశానని తెలిపారు. కావలి అభివృద్ధి చెందాలంటే కావ్య క్రిష్ణారెడ్డి రావాలని, ఎంఎల్‌ఎగా గెలవాలని, అందుకే టిడిపిలో చేరినట్లు తెలిపారు. కావలిని అభివృద్ధి చేసే నాయకుడు కావ్య క్రిష్ణారెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ట్యాంకర్ బోల్తా..

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రానికి సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కృష్ణపట్నం పోర్టు నుండి ప్రొద్దటూరు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. వాహనం నడుపుతున్న డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు.

దర్గాలో వైసిపి అభ్యర్థుల ప్రార్థనలు

ప్రజావక్తి-ఎఎస్‌పేట

మండల కేంద్రమైన ఎఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రమాల్ దర్గాలో గురువారం నెల్లూరు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎంఎల్‌ఎ అభ్యర్థి మేకపాటి విక్రమ్ రెడ్డిలు దర్శించుకున్నారు. ఎఎస్ పేటకు విచ్చేసిన వారికి స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ హజరత్ ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మల నమాధులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎఎస్‌పేట దర్గాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వైసిపి మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మేకపాటి విక్రమ్ రెడ్డి గ్రామాల వారీగా నాయకులను ఎంపి అభ్యర్థి విజయసాయి రెడ్డికి పరిచయం చేశారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా మేకపాటి విక్రమ్ రెడ్డిని, ఎంపిగా తనను అత్యధిక మెజారిటితో గెలిపించేలా అందరం సమిష్టిగా కష్టపడుదామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ వందిళ్లపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ పేట దర్గా సెంటర్‌కు చెందిన 100 మంది యువకులు వైసిపిలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న సంక్షేమానికి తోడు తమ బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తామని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ పులిమి రమేష్ రెడ్డి, జెడ్‌పిటిసి పందిళ్లపల్లి రాజేశ్వరమ్మా, అన్ని గ్రామాల వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో వైసిపి ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థులు

వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాబోయే ఎన్నికలలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్లకు రూ.10వేలు చేస్తామని టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అప్పారావు పాలెం, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, మురగళ్ల, గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ మేకపాటి కుటుంబం ఎస్‌సి ఎస్‌టిలంటే చిన్నచూపు చూస్తున్నారని రాబోయే ఎన్నికలలో మీ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలందరూ సంఘటితమై జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని, ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి తనను, ఎంపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాళ్లూరు గిరినాయుడు, బట్టేపాడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, చంద్ర వెంకట సుబ్బానాయుడు, అధ్యక్ష కార్యదర్శులు కేత విజయభాస్కర్ రెడ్డి, సుంకర పెంచలయ్య చౌదరి, ఎంపిటిసి శశిధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎంఎల్‌ఎ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి, గెలవడం ఖాయమని జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ తెలిపారు. గురువారం ఆయన వైసిపి అభ్యర్థుల తరపున పట్టణ పరిధిలోని సినిమాహాల్ సెంటర్, మంగలపాలెం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి కరపత్రాలను అందించి వైసిపి అభ్యర్థులు గెలవడం ఖాయమని, వైసిపి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రెండోసారి ఎంపిక కావడం తథ్యమన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సష్టించిన రాబోవు రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి జగనన్న అని స్పష్టం చేశారు. మే 13వ తేదీ ఎన్నికలలో వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. ధర్వేష్ మొహి ద్దీన్, కాసింసా, బాబు, కరీం, ఫజల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగంలోని వైసిపి నాయకులు గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వైసిపి మండల నాయకులు కె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అరుంధతీయవాడ పల్లి వారి సెంటర్‌లో వైసిపి కార్యకర్తలతో కలిసి వైసిపి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఓట్లను వేయాలని సూచించారు. సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ తిరుమల రవీంద్రబాబు, ఎర్రం చెట్టు శివ పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 910పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 744పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 155పొగాకు బేళ్లనుతిరస్కరించారని తెలిపారు. వీటిలో ఎన్ఎస్36ఎన్ బి106 సిఆర్ 13ఉన్నాయని, అధిక బరువుతో ఉన్న 11పొగాకు బేళ్లను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్టధర రూ.296 కాగా కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.261.74నమోదు కాగా, వేలంలో 20మంది కంపెనీ వ్యాపారస్థులు పాల్గొన్నారన్నారు.

మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల, వరికుంటపాడు, మంచాలపల్లి గ్రామాలలో గురువారం మండలం టిడిపి సీనియర్ నాయకులు పాతపాటి మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాతపాటి జన్మదిన వేడుకల కేకును తెలుగుదేశం నాయకులు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పాతపాటి మధుసూదన్ రెడ్డికి ఆత్మకూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు జంజం నారాయణ, అబ్దుల్ రెహమాన్, శోభ, నీలం అంజయ్య, శెట్టిబోయిన మల్లిం కొండయ్య, ఎం.భాస్కర్ రెడ్డి, రాపూరు వెంకటేశ్వర్ రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి అనంతసాగరం

మండల కేంద్రంలో టిడిపి నాయకులు బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ, బిసి డిక్లరేషన్ కార్యక్రమం వివరములు తెలుపుతూ ఇంటి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు మునగపాటి సునీత సుబ్బరాజు, పలు గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ నెల్లూరు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అలాగే ఆత్మకూరు నియోజకవర్గం ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డిలకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రజాశక్తి-కావలి : స్థానిక 6వ వార్డులో పాత వూరుకు చెందిన రైతు నాయకుడు టిడిపి నాయకులు రామిరెడ్డి కృష్ణారెడ్డి "విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి" అవతారంలో గురువారం వెంగాయగారి పాలెంలో పర్యటించారు. తెలుగుదేశంపార్టీ గెలవాలని, కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను గెలిపించాలని, నారా చంద్రబాబు నాయుడును ముఖ్య మంత్రిని కావాలని కోరుకుంటూ అక్కడ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి జంపాని ప్రసాద్, పట్టణ నాయకులు తిరువీధి ప్రసాద్, పొట్లూరి శ్రీనివాసులు, జనిగర్ల మనోహర్, దాసరి రవి, ఉప్పల శ్రీనివాసులు, తిక్క శివకృష్ణ, మోటువలి వెంకటేశ్వర్లు, కీర్తి బాబూరావు, ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : అప్పసముద్రం ఉదయగిరి పట్టణంలోని శ్రీనగర్ ఇందిరానగర్ కాలనీ మంగళకట్ట సినిమా హాల్ సెంటర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, ఉపసర్పంచ్ ముర్తుజా గురువారం ఇంటింటి ప్రచారం విస్తృత చేపట్టారు. ఈ వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నూతన మేనిఫెస్టోను వివరించారు. నెల్లూరు పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గడయాల్చి ఎస్థాని, ఉప్పుటూరి హరి పెంచలయ్య టింకర్ బాబు మండల కో ఆప్షన్ సభ్యులు సుభాని, వార్డ్ మెంబర్ ఉప్పుటూరి శీను, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : టిడిపి పాలనలో ముస్లిములకు ఒక్క చిన్నపాటి అన్యాయం జరగలేదని టిడిపి రాష్ట్ర ముస్లిం నాయకులు ఇక్బాల్ సహా ముస్లిం వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ముస్లిం నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లిం సమాజం మొత్తం చంద్రబాబుకు అండగా నిలిచి కావలిలో కావ్యా క్రిష్ణారెడ్డిని ఎంఎల్‌ఎ చేసుకుని, వేమిరెడ్డిని ఎంపిగా గెలిపించుకుని, ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసుకుని సమస్యల విష వలయం నుంచి బయట పడుదామంటూ వక్తలు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-సంగంలో టిడిపి నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. సంగం సినిమా హాల్ సెంటర్ నుండి మండల టిడిపి అధ్యక్షులు గుండ్లపల్లి టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు యాదవ్ ప్రచారం చేపట్టారు. రాళ్లచిలికులు మాజీ సర్పంచి జిల్లా టిడిపి నేత కోర్టు కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణలు చెక్‌పోస్ట్ సెంటర్ నుండి కాకు మధుసూదన్ యాదవ్‌లు నేతృత్వంలో టిడిపి ప్రచారం కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం ప్రచారం

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం పడమటికంభంపాడు గ్రామంలో గురువారం మండల యువజన విభాగం అధ్యక్షులు బట్రెడ్డి నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బట్రెడ్డి నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చారన్నారు. ప్రతి గడపగడపకు వెళ్లి జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. మేకపాటి విక్రమ్‌రెడ్డి నాయకత్వం, ఊరిబిండి ప్రభాకర్ రెడ్డి, రాపూరు వెంకటసుబ్బారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని యువత పురవీధుల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన నాయకులు కలవాయి వినోద్, సుజిత్ కుమార్, పొద్దుటూరు వినోద్, మురళి, వెంకటేశ్వర్ల రెడ్డి, ఎల్లారెడ్డి, మాజీ వాలంటరీలు, యువత పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిపై తొలి సంతకం

-మాజీ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతీ యువకులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు...సిఎంగా చంద్రబాబునాయుడు మొదటి సంతకం మెగా డిఎస్‌సిపైనే చేస్తారని... యువతకు నారా లోకేష్ హామీ ఇచ్చారని... మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె సింధూర పొంగూరు తెలిపారు. 45వ డివిజన్ లో గురువారం ఆమె ఇంటింటికెళ్లి 2014 నుంచి 2019 వరకు నారాయణ చేసిన అభివృద్ధిని తెలియజేశారు. చంద్రబాబు విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకి వివరించారు. మే 13న ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటేసి... నారాయణను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డిని ఎంపిగా గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నెల్లూరులో యువతీ యువకులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెడతామని...అదే విధంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గవర్నమెంట్ ఫాం చేసిన మొదటి వంద రోజుల్లోనే స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్‌ని డిక్లర్ చేస్తానన్నారు. నాన్నని ఎమ్మెల్యేగా, వేమిరెడ్డిని ఎంపిగా భారీ మెజారిటీతో గెలిపించాల్లని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో జరగనున్నట్లు ఎంపిడిఒ తోట వెంకట కష్ణ కుమారి గురువారం తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-వలేటివారి పాలెం

ప్రతి ఒక్కరూ మీ ఇంటి కుటుంభ సభ్యుడిలా ఆదరించి ఆశీర్వదించాలని కందుకూరు నియోజకవర్గం టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావ తెలిపారు. వలేటివారిపాలెంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాంతో కలిసి నాగేశ్వరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ వలేటివారిపాలెం మండలం ఎప్పుడూ టిడిపికి కంచుకోట అన్నారు. మండలంలో టిడిపికి గతంలో కంటే ఈ సారి భారీ మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. శివరాం సహయ సహకారాలు ఉన్నాయని తెలిపారు. శివరాంను గురువుగానే బావించి ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని తెలిపారు. భావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిమాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం తెలిపారు. టిడిపి ప్రారంభోత్సవ కార్యక్రమంలో శివరాం మాట్లాడుతూ గ్రామాలలోని కార్యకర్తలలో చిన్న చిన్న విభేదాలను ఉన్నప్పటికీ అవి పక్కనపెట్టి నెల్లూరు పార్లమెంటు టిడిపి ఉమ్మడి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కందుకూరు నియోజకవర్గం టిడిపి ఉమ్మడి ఎమెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావులను అత్యదిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు వలేటి శ్రీధర్ నాయుడు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, కొంకా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండల వలసలతో వైసిపి బక్కచిక్కుతుంటే టిడిపి బలపడుతోంది. గూడూరి శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన తలారి నాగరాజు, సందీప్, గంగపట్నం విజయ్, జి శ్రీహరి తదితరులతో కలిసి 25 మంది యువకులు కోవూరు ఎన్డిఏ కూటమి అభ్యర్థిని శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపిలో చేరిన వారికి ప్రశాంతి రెడ్డి వారికి పసుపు కండువాలు వేసి పార్టీ లోనికి అహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకై ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చిన వేమిరెడ్డి దంపతుల విజయం కోసం కషి చేస్తానన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

కాంగ్రెస్‌తోనే 'ఉదయగిరి' జిల్లా సాధ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి జిల్లా, ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అది కూడా ఇండియా కూటమి ఎంపి అభ్యర్థి మాజీ కలెక్టర్ కొప్పుల రాజు ఆధ్వర్యంలో మరింతగా సాధ్యమవుతుందని జిల్లా ఉద్యమ అధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక షాదీమందిర్‌లో ముస్లిముల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇండియా కూటమి ఎంపి అభ్యర్థి కొప్పుల రాజును కలిసి ఉదయగిరి జిల్లా చేయాలని కోరారు. అనంతరం డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఈ ఎన్నికల అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముఖ్యంగా ముస్లిములు కేంద్ర ప్రభుత్వం ముస్లిములపై జరుగుతున్న దాడులను గుర్తించి ఉదయగిరి జిల్లా చేసుకునేందుకు మన ముందుకు వచ్చిన

కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి సోము అనిల్ కుమార్‌ను ఎంపిఅభ్యర్థి కొప్పుల రాజులను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమ నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు, పవన్ రోడ్‌షో

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ నేడు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు నేడు రోడ్‌షో నిర్వహించనున్నారు. సాయంత్రం 5. గంటలకు రెండు ప్రత్యేక హెలికాప్టర్‌లో నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ఇద్దరు నేతలు వేరు వేరుగా రానున్నారు. అధికారులు పరిశీలించారు. అనంతరం 5.30 గంటలకు స్థానిక కెవిఆర్ పెట్రోల్ బంకు నుంచి రోడ్ షో సాగుతుంది. నెల్లూరు రూరల్ టిడిపి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వీరి వెంట పాల్గొంటారు. ఆర్‌టిసి, మీదుగా విఆర్‌సి వరకు రోడ్ షో నిర్వహిస్తారు. విఆర్‌సి నుంచి నెల్లూరు నగర అభ్యర్థి పి. నారాయణతో కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. గాంధీబొమ్మ మీదుగా నర్తకి సెంటర్ వరకు సాగుతోంది. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభ నిర్వహిస్తారు. బాబు, పవన్ రోడ్‌షోకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

'ఆనం' ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సంగం

మండలంలోని సిద్ధీపురం, వేంగారెడ్డి పాలెం, పడమటిపాలెం పంచాయతీల్లో మాజీ మంత్రి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ప్రచారానికి వచ్చిన ఆనం రామనారాయణ రెడ్డికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు వేసి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. సిద్ధీపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా పరిపాలన సాగిస్తున్న జగన్మోహన్ రెడ్డి పరిపాలనను ప్రజలు సాగనంపాలన్నారు. ప్రజలు టిడిపి పార్టీని ఆదరించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఎంఎల్ఏగా తనను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలనీ కోరారు. కార్యక్రమంలో ఎన్‌డిసిసిబి మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయులు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజిరెడ్డి, సిద్ధీపురం సర్పంచ్ ప్రసూన, టిడిపి నాయకులు సూరా శ్రీనివాసులు రెడ్డి, వేంగారెడ్డి పాలెం సర్పంచ్ ఆనంద్ ప్రసాద్ రెడ్డి, కనుమూరు సుధాకర్ రెడ్డి, పడమటిపాలెం సర్పంచి కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, రసూల్, మాజీ జెడ్‌పిటిసి చంద్రశేఖరయ్య, టిడిపి నాయకులు కర్నాటి రవీంద్రా రెడ్డి, మాజీ సర్పంచ్ కోటు కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రచారం

ప్రజాశక్తి - కావలి

ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

కావలి పట్టణంలోని మద్దురుపాడు 1వ వార్డులో గురువారం ఎంఎల్ఎ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటా ప్రచారంలో అపూర్వ స్వాగతం ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి అంటూ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కావలి పట్టణంలోని మద్దురుపాడు 1వ వార్డులో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పట్టణ పరిధిలోని అడవిరాజుపాలెం, మద్దురుపాడులో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుకు చేరుకున్న ఎంఎల్ఎ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి మహిళలు గ్రామస్తులు మంగళహారతులతో బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జ్ వేణు, నాయకులు పులి చక్రపాణి, పులి రజని, స్కైలాబ్, వార్డు పరిశీలకులు దుంప భాస్కర్ రెడ్డి, తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో మత్స్యకారులకు పెద్దపీట

ప్రజాశక్తి-బిట్రగుంట

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మత్స్యకారులకు పెద్దపీట వేసినట్లు, మత్స్యకారులకు బోట్లు, వలలు, సబ్సిడీలు, రుణాలు, వేట విరామ సమయంలో భృతి, తదితర లబ్ధిని చేకూర్చడం జరిగిందని కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం బోగోలు మండలం చెన్నారాయునిపాలెం పంచాయతీ, జువ్వలదిన్నె పంచాయతీల్లో పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, తదితర నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు. కావ్య క్రిష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద రవిచంద్ర రాకతో జనం పోటెత్తారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత 5యేళ్లలో జరిగిన అభివృద్ధేమీ లేదన్నారు. ఎక్కడ చూసినా గ్రామస్తుల అవస్థలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు వైసిపి హయాంలో తీవ్ర వివక్షకు గురయ్యాయన్నారు. కావలి ఎంఎల్ఏగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చేసిన అభివృద్ధి పని ఒకటైనా ఉందా అని ప్రశ్నించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా, యువత బాగుపడాలన్నా నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో

మాట్లాడుతున్న కావ్యక్రిష్ణారెడ్డి

ముందుకు వెళుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మత్స్యకార సోదరులకు వేట విరామ సమయంలో రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతుందని, బోట్ల మరమ్మతలకు ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని, ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలు ఇస్తామన్నారు. మత్స్యకారులు తమ దృష్టికి తెచ్చిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. రోడ్లు, వంతెనలు ఏర్పాటు చేసే బాధ్యత తమది అని పేర్కొన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పుట్టిన జువ్వలదిన్నె గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఐదేళ్లుగా ఎంఎల్ఏ ప్రతాప్‌కుమార్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, దానిని అంతమొందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి ఇంట సుఖ సంతోషాలు నిండాలని కూటమి మేనిఫెస్టోను విడుదల చేసిందన్నారు. మత్స్యకార గ్రామాల్లోని అన్నీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి అందిచడం జరుగుతుందన్నారు. స్కూల్‌కి వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు అందిస్తారని, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం ఇస్తారని, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, 18యేళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1,500 మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, వితంతువులకు నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే రూ.4వేల పింఛను ఇస్తామన్నారు. పెంచిన పింఛన్లను ఏప్రిల్ నుంచి పరిశీలించి జూన్‌లో పెంచిన పింఛన్లను అందజేస్తామన్నారు. గత ఐదేళ్లుగా వైసిపి అరాచకాలు శృతి మించాయన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇచ్చి భారీ మెజారిటీ తో ఎంఎల్ఏగా కావ్య క్రిష్ణారెడ్డి, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, లేళ్లపల్లి సుధీర్, బీద గిరిధర్, వేమిరెడ్డి కోటారెడ్డి, వాసు, పైడి హర్ష, కొండూరు పాల్ శెట్టి, బడుగు వెంకయ్య, కోట వెంకారెడ్డి, నాయకులు గుండ్లపల్లి భరత్ కుమార్‌యాదవ్, గ్రామ కాపులు, మత్స్యకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.